క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు లిఖిత్‌రావు



పరవాడ: మండలంలో నిగొర్లివానిపాలెం సాయి విద్యా నికేతన్ పాఠశాలకు చెందిన లిఖిత్‌రావు రాష్ట్ర స్థాయి నెట్ బాల్ అండర్–17 పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రంగారావు తెలిపారు. నెల్లూరులో ఈ నెల 9 నుంచి 11 వరకు జరగనున్న పోటీల్లో విద్యార్థి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లిఖిత్‌రావును పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పైప్‌లైన్ లీకేజీ.. తాగునీరు వృథా



వాడచీపురుపల్లిలో పైపులైన్ లీకేజీతో నాచు పట్టిన రోడ్డు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం సమీపంలో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నెల రోజుల క్రితం వాటర్ ట్యాంకు సమీపంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు రంధ్రం ఏర్పడి, చాలా నీరు రోడ్డుపాలవుతోంది. పైప్‌లైన్ లీకేజీ వల్ల రోడ్డు నాచుకట్టి రాకపోకలు సాగించే ప్రయాణికులు జారి పడుతున్నారు. లీకేజీ ప్రదేశంలో దుకాణ సముదాయాలు ఉండడంతో నిత్యం కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధిలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు బుధవారం పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు పార్టీ క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నంగినారపాడు, అజనగిరికాలనీ, శెట్టివానిపాలెం, వెదుళ్లనరవ, కొత్తూరు, సత్తివానిపాలెం, నరవ గ్రామాలలో రూ.2.94 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న సబ్బవరపు పైడం దంపతులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రావలమ్మపాలేనికి చెందిన శివరంజని బుక్స్, ప్రింటర్స్ నిర్వాహకులు సబ్బవరపు పైడం దంపతులు రూ.50,116 విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని స్వామివారి ఆలయం వద్ద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. సబ్బవరం గ్రామానికి చెందిన మైసర్ల అప్పలరాజు రూ.10,116 విరాళం ఇచ్చారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు బర్ల రమణ, గెద్దం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, గెద్దం రమణ, చింతల శ్రీను, కొల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.

‘ప్రసాద్’ పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అశోక్‌గజపతి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ప్రసాద్ పథకం అభివృద్ధి పనులను మంగళవారం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు పరిశీలించారు. సింహగిరిపై జరుగుతున్న క్యూ కాంప్లెక్స్, కొండదిగువ కొత్త టోల్‌గేట్ వద్ద చేపట్టిన పనుల్ని పరిశీలించి, పనులు వేగవంతం అయ్యేలా చూడాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. దేవస్థానం తరపున ఈవో త్రినాథరావు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాన్ని అందించారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్.. కనెక్టివిటీ మిస్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవతో పాత గోశాల నుంచి పాత అడవివరం మధ్య ఏళ్ల తరబడి నిలిచిన బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. 2.5 కి.మీ. పొడవున రోడ్డును విస్తరించారు. ఆ తర్వాత ఎన్నికలు జరిగి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీలకు వెళ్లే కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి మూలకు చేరింది. దీంతో ఆయా కాలనీలకు చెందిన పాదచారులు, వాహనదారులు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- రోడ్డు విస్తరించారు.. అనుసంధానం మరిచారు
- కనెక్టివిటీ రోడ్లు సరిగా లేక వాహనదారుల ఇక్కట్లు
- రోడ్లు ఎక్కి దిగేందుకు వృద్ధులు, పిల్లల్లో భయాందోళన
- రాళ్లు తేలి, జారి పడుతున్న పాదచారులు, వాహనదారులు

కనెక్టివిటీ మార్గాలు

పాత గోశాల నుంచి పాత అడవివరం మార్గంలో మారుతీ కల్యాణ మండపం, శిడగం వీధి, ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారి, చందనపురి కాలనీ, టీవీ టవర్ కాలనీ, పైడితల్లి ఆలయానికి వెళ్లే దారి, సింహాచలం బస్టాండ్, కాపుదిబ్బ, చింతచెట్టు, గాంధీనగర్, ఎస్సీ కాలనీ, పాత అడవివరం, దత్తసాయి ఆలయం తదితర కనెక్టివిటీ మార్గాల్లోకి కాలనీవాసులు వెళ్లాలంటే బీఆర్‌టీఎస్ రోడ్డే ఆధారం.



అడవివరం ఆరోగ్యకేంద్రానికి వెళ్లే మార్గం దుస్థితి, (ఇన్‌సెర్ట్) ఎత్తుగా కట్టిన కల్వర్టు

సింహాచలం: పాత గోశాల నుంచి పాత అడవివరం వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న కాలనీల్లోకి వెళ్లేందుకు పలుచోట్ల కనెక్టివిటీ రోడ్లున్నాయి. బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు జరగకముందు ప్రధాన మార్గానికి సమాంతరంగా ఈ రోడ్లు ఉండేవి. దీంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులుండేవి కావు. కొన్ని మార్గాలు మట్టి రోడ్లే అయినా కాలనీవాసుల రాకపోకలు సజావుగా సాగేవి.

బీఆర్‌టీఎస్ రోడ్డు పనుల తర్వాత ఈ కనెక్టివిటీ రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. రోడ్డును విస్తరించి, కనెక్టివిటీ రోడ్లను పట్టించుకోలేదు. దాదాపు అన్ని చోట్ల ప్రధాన రోడ్డు ఎత్తు పెరిగి, కనెక్టివిటీ మార్గాల నుంచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కొన్ని చోట్ల బీఆర్‌టీఎస్ రోడ్డులోకి రావాలంటే డ్రైనేజీలు ఎత్తుగా ఉండి, నరకం చూస్తున్నారు.



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు దుస్థితి

ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకూ అవస్థలు

బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి అడవివరం ఆరోగ్యకేంద్రానికి వెళ్లే కనెక్టివిటీ మార్గం సరిగా లేకపోవడంతో రోగులు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి చేరుకునే ప్రధాన మార్గం బీఆర్‌టీఎస్ విస్తరణ తర్వాత అస్తవ్యస్తంగా మారింది. మరో మార్గాన్ని ఏర్పాటు చేసినా అదికూడా దారుణంగా ఉంది. రోగులు, స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో మూడు నెలల కిందట రెండు మార్గాలను రాకపోకలకి అనువుగా మార్చారు. కొన్ని రోజులకే రెండు మార్గాలూ రాళ్లుతేలి, పెద్ద పెద్ద కంకర బయటకి వచ్చి ప్రమాదకరంగా మారాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ఎక్కడ జారిపడతామో అని భయపడుతున్నారు.



గాంధీనగర్‌కి వెళ్లే మార్గం దుస్థితి

ఆర్టీసీ కాంప్లెక్స్ దరి అధ్వానం

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా వెళ్లాలంటే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా బస్టాండ్‌లోకి ఉన్న కనెక్టివిటీ మార్గం వద్ద అభివృద్ధి పనులు చేశారు. డ్రైనేజీ కోసం కల్వర్టులు నిర్మించారు. బీటీ రోడ్డు మాత్రం వేయలేదు. దీంతో బస్టాండ్ ప్రవేశ మార్గం వద్ద రోడ్డు రాళ్లు తేలి ప్రయాణికులు నడిచేందుక్కూడా వీల్లేకుండా తయారయింది. ఈ రోడ్డుపై బస్సులు, కార్లు ఏ మాత్రం వేగంగా వెళ్లినా.. టైర్లకు చివరన రాళ్లు తూటాల్లా దూసుకొచ్చి, పలువురు గాయపడుతున్నారు.

రోడ్డుపైకి రావాలంటే భయం



అడవివరం ఆరోగ్య కేంద్రం పక్కనున్న మార్గం నుంచి బీఆర్‌టీఎస్ మార్గానికి రాకపోకలు సాగిస్తుంటా. ఇటీవల వేసిన తాత్కాలిక రోడ్డు శిథిలమైంది. కనెక్టివిటీ మార్గం ఎత్తులో ఉండటం, రాళ్లు తేలి ఉండటంతో ఎక్కి, దిగేందుకు ఇబ్బందులు పడుతున్నాం. చిన్నారుల పరిస్థితి మరీ దారుణం.

– చంద్రశేఖర్, రిటైర్డ్ ఉద్యోగి, ప్రియాగార్డెన్స్

స్కూల్ పిల్లలకు ఇబ్బంది



గాంధీనగర్ వద్ద కనెక్టింగ్ మార్గం సరిగ్గా లేకపోవడంతో స్కూల్ పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. స్కూల్ బస్సు దిగి పిల్లలు కనెక్టింగ్ మార్గంలోకి వస్తున్న సందర్భంలో పడిపోతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. ప్రస్తుతం పిల్లలు స్కూళ్లకు వెళ్లి వచ్చే వరకు తల్లిదండ్రులు భయపడుతూనే ఉన్నారు.

– సంతోష్, గాంధీనగర్

బస్టాండ్ వద్ద రోడ్డు వేయాలి



సింహాచలం బస్టాండ్ ప్రవేశ మార్గం వద్ద మార్గం సరిగ్గా లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు తేలిన రోడ్డుపై నడవాలంటే అవస్థలు పడుతున్నారు. వృద్ధులకు మరీ ఇబ్బందిగా ఉంది. ఏ వాహనం ఎటు వెళ్తుందో కూడా తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలి.

– కృష్ణాజీ, పాత అడవివరం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

పాత గోశాల నుంచి పాత అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డును, దానికి ఇరువైపులా ఉన్న కనెక్టివిటీ రోడ్లను ఇటీవల స్వయంగా పరిశీలించాను. ఆయా మార్గాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించా. రోడ్డు కనెక్టివిటీ సమస్యలను పలువురు స్థానికులు కూడా నా దృష్టికి తీసుకొచ్చారు. దీన్ని జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కనెక్టివిటీ మార్గాలను అభివృద్ధి చేసేందుకు, రోడ్ల పునరుద్ధరణకు కృషిచేస్తాను.

– హైమావతి, జెడ్సీ, జీవీఎంసీ జోన్–8

హోమియో వైద్యంపై ఆశా కార్యకర్తలకు శిక్షణ



సబ్బవరం పీహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీలో పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, పీహెచ్‌సీ సిబ్బంది

సబ్బవరం: ఆయుష్ వైద్యం ద్వారా ఆరోగ్య సంరక్షణతో పాటు పలు వ్యాధులను నియంత్రించవచ్చని సబ్బవరం హోమియోపతి వైద్యాధికారి డాక్టర్ కుసుమ కుమారి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్రం పరిధి ఆశా కార్యకర్తలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా అందించే వైద్యం ద్వారా ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం నియంత్రణ విధానాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ఆయుష్ కమిషనర్ రాజేంద్రప్రసాద్, జోన్–1 ఆర్‌డీడీ వై.శేఖర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు హోమియో వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి, డాక్టర్ ఆశ, డాక్టర్ విద్యాధరి, సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వోలు పాల్గొన్నారు.

10న మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవం

సబ్బవరం: మండలంలోని బలిజపాలెంలో ఈ నెల 10న మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవం జరపనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మామిడి కొండాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణతో పాటు మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కరుణించి కాపాడు నాగమ్మ

నాగమ్మ తల్లీ.. సందె పొద్దు వేళ పడగవిప్పి శివాలెత్తే నిన్ను చూసి గగ్గోలుపెట్టినా.. కోపం వద్దు. పొలం పనులో.. మరొకటో పూర్తి చేసుకుని ఇళ్లకు చేరే సమయాన నీ కంట పడితే బుసలు కొట్టి.. కాటేయకు. గొర్రెలు, బర్రెలు, దూడలు, మా కన్నబిడ్డలు.. వంశాలు నిలవాలి.. మా చేలన్నీ పండాలి. కోడిగుడ్లు, నువ్వుండలు, కడుపారా పాలుపోసి మనసారా కొలుచుకుంటాం. అంటూ నాగుల చవితి సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఘనంగా నాగేంద్రుడికి, నాగదేవతకు పూజలు చేశారు.

- భక్తిశ్రద్ధలతో నాగుల చవితి
- ఊరూ వాడా పుట్టల వద్ద బారులు తీరిన ప్రజలు



రాముడిగారి గ్రామంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న ప్రజలు

పెందుర్తి: నాగుల చవితిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి నాగేంద్రుడు/నాగమ్మతల్లిని ఆరాధించారు. నాగుల వస్త్రాలు సమర్పించారు. చిమ్మిలి, చలిమిడి, గుడ్లు, పాలు నైవేద్యంగా అందించారు. చిన్నారులు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. పలు చోట్ల కుటుంబ సమేతంగా వనభోజనాలు ఆరగించారు. చింతలగ్రహారం, వేపగుంట, చినముషిడివాడ, సుజాత నగర్ తదితర ప్రాంతాల్లో గృహాలకు దూరంగా పుట్టలను వెతుక్కుని, తుప్పల్ని తొలగించి మరీ పూజలు చేశారు.

పరవాడ: నాగుల చవితి వేడుకలను మండలంలోని 15 గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి, పుట్టల వద్దకు చేరుకుని, ముందుగా పుట్టలను అలంకరించారు. చిమ్మిలి ప్రసాదం, గుడ్లు, పాలు పోసి పూజించారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట మత్స్యకార గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.

సబ్బవరం: మండలంలోని ఊరూరా నాగుల చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపాధి, ఉద్యోగాలతో పట్టణ ప్రాంతాల్లో స్థిరపడినవారు సైతం గ్రామాలకు చేరుకుని నాగుల చవితిని ఆనందంగా జరిపారు. ఉదయాన్నే తలస్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించి, పుట్టల వద్దకు చేరుకుని, నాగదేవకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులంతా కలిసి చిమ్మిలి, తాటిగుజ్జు, గుడ్లు, అరటిపండ్లు సమర్పించి పూజించారు.



మొగలిపురం గ్రామంలో నాగుల చవితి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండలంలోని మొగలిపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి నాగమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. నైవేద్యం సమర్పించారు. గుళ్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు దంపతులు, సర్పంచ్ బండారు మంగ, శ్రీను దంపతులు నాగదేవతకు పాలు, గుడ్లు, చిమ్మిలి తదితర నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు.

సింహాచలం: నాగుల చవితిని మంగళవారం జీవీఎంసీ 93, 98వ వార్డుల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. రెండు ముహూర్తాలుండటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుటుంబసమేతంగా పుట్టల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు, చిమ్మిలి, చలివిడి వేశారు. పిల్లలు, పెద్దలు బాణసంచా వెలిగించి, ఆనందోత్సాహాల మధ్య పూజలు జరిపారు. సింహగిరి ఘాట్‌రోడ్డులోని ఫలసాయం తోటలు, భైరవవాక, సింహాచలం దేవస్థానం పూలతోట, విజినిగిరిపాలెం, పాత అడవివరం, గోశాల లేఅవుట్, లండగరువు, శ్రీనివాసనగర్, సింహపురి కాలనీ, ప్రహ్లాదపురం, సింహపురి లేఅవుట్, బాలాజీనగర్, పురుషోత్తపురం తదితర ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్దకు పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లి, పూజలు చేశారు.



సింహాచలం పూలతోటలో పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు



చింతలగ్రహారంలో నాగుల చవితి పూజలు చేసిన గ్రామస్తులు

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



కోట్నీవానిపాలెంలో ఆదిదంపతులు



చినముషిడివాడలో గౌరీ పరమేశ్వరుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని గౌరీ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదిదంపతులు కొలువుదీరారు. భక్తులు సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

- మండలంలోని కోట్నీవానిపాలెంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. – పెందుర్తి రాచ్చెరువు కాలనీలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా మేళతాళాలు, బాణసంచా నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు చేశారు.
- చింతలగ్రహారం కాలనీలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. తొలుత గౌరీపరమేశ్వరుల్ని పల్లకిలో ఊరేగించి, పూజలు చేశారు.

రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించేదెప్పుడో?

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు పూర్తి
- ప్రారంభోత్సవంపై అధికారుల మీనమేషాలు



ప్రారంభానికి నోచుకోని కలపాక రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్

పరవాడ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణం పూర్తి చేసుకున్న రక్షిత మంచినీ పథకం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో కలపాక ప్రజల తాగునీటి ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి.

కలపాక గ్రామంలో బోర్ల నుంచి కలుషిత నీరు వస్తుండడంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు గత ప్రభుత్వం చొరవ చూపింది. గ్రామానికి సమీపంలో బోరును ఏర్పాటు చేసి ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టింది. ఇందు కోసం రూ.20 లక్షలు వెచ్చించి, 40 వేల లీటర్ల సామర్థ్యమున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించింది. ఇంతలో ఎన్నికలు వచ్చి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రక్షిత మంచినీటి పథకం ప్రారంభానికి నోచుకోలేదు. పథకం పనులు పూర్తయి ఏడాది కావస్తున్నా.. ప్రస్తుత ప్రభుత్వం ప్రాంభోత్సవానికి చొరవ చూపకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొర కుళాయి నీటితో ఇబ్బందులు

గ్రామంలో బోర్ల నుంచి కలుషిత నీరు రావడంతో ప్రజలు తాగునీటి కోసం కుళాయిలపైనే ఆధారపడ్డారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురై మూలకు చేరింది. కుళాయిల నుంచి కూడా పూర్తి స్థాయిలో ప్రజల అవసరాలకు సరిపడా నీరు సరఫరా కాని పరిస్థితి. తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతాలైన వెన్నలపాలెం, పరవాడ, పి.బోనంగి గ్రామాల్లో ఉన్న వాటర్ ప్లాంట్లపై ఆధారపడి, దప్పిక తీర్చుకుంటున్నట్లు ప్రజలు చెప్తున్నారు. కొత్తగా నిర్మించిన ఈ రక్షిత పథకాన్ని ప్రారంభిస్తే తమ వెతలు తీరుతాయని ఆశించామని, అదికూడా మూలకు చేరినట్టే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారుల్ని కోరుతున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ షణ్ముఖను వివరణ కోరగా జల్ జీవన్ మిషన్‌లో చేపట్టిన పైప్‌లైన్ పనులు కొన్ని చోట్ల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పూర్తి చేసి, త్వరలోనే పథకాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

యువత బాధ్యతాయుతంగా మెలగాలి

విశాఖ సిటీ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, బాధ్యతాయుతంగా మెలగాలని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం కారణంగా ఆరోగ్యం పాడవడంతో పాటు, చట్టపరమైన చర్యలకు బాధ్యులుగా నిలవాల్సి వస్తుందని చెప్పారు. సైబర్ నేరాల నిరోధంలో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, నియంత్రణ అందరి సమన్వయం, సహకారంతోనే సాధ్యపడుతుందన్నారు.

విద్యార్థి దశలో ఎన్నో సవాళ్లు

విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. చుట్టూ సమాజంలో అనేక ఆకర్షణలు యువతను పెడదోవ పట్టించే దిశగా నడిపిస్తాయని, వీటికి దూరంగా ఉండాలన్నారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు, క్రమశిక్షణతో ముందుకు సాగితే అందమైన భవిష్యత్తు సాకారం అవుతుందన్నారు. విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సాల్మన్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ రాము, డాక్టర్ మూర్తి, డాక్టర్ హేమలత, డాక్టర్ వినీలకుమారి పాల్గొన్నారు.

అంతర్గత శక్తి కోసం శక్తి ఉపాసన దీక్ష

షష్టి పూర్తి వేడుకలో శారదా పీఠాధిపతి ప్రకటన



స్వామీజీకి పాదపూజ చేస్తున్న దృశ్యం

పెందుర్తి: అంతర్గత శక్తి కోసం వచ్చే ఏడాది పాటు శక్తి ఉపాసన దీక్ష చేపట్టనున్నట్లు శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రకటించారు. వారణాసి గంగానదీ తీరంలోని శారదాపీఠం శాఖలో స్వామీజీ షష్టి పూర్తి మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామీజీకి పాదపూజ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ అద్వైత సిద్ధాంత వ్యాప్తి కోసం, సామాజిక బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పీఠం ఎల్లప్పుడూ పనిచేస్తుందన్నారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ స్వామీజీ స్ఫూర్తికి అనుగుణంగా భక్తకోటి అభ్యుదయం కోసం పీఠం మరింత కృషి చేస్తుందన్నారు. మైసూర్ గణపతి సచ్చిదానంద సరస్వతి, పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద సరస్వతి, హర్యానా పీఠం మాతాజీ, ఉత్తరప్రదేశ్ విధురాశ్రమ అధిపతి కుమారానంద గిరి స్వామి, అవధ్ ప్రాంతం నుంచి సర్కార్ జీ, రిషికేష్ సచ్చిదానంద ఆశ్రమ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.